ఉగ్రవాదంపై ప్రజాగ్రహం

● వాడవాడలా కొవ్వొత్తులతో ర్యాలీ ● ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ ● ఉగ్రవాద భావజాల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలి



గోల్డెన్ పామ్స్ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

నల్లకుంట: పహల్గామ్‌లో పర్యాటకులపై విచక్షణ రహితంగా జరిపిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం నల్లకుంటలో క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. వైదేహి నివాస్ గోల్డెన్ పామ్స్ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఉగ్రమూకల కాల్పుల్లో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ పామ్స్ ఉపాధ్యక్షుడు రవీందర్, ప్రతినిధులు మెగా డిజిటల్స్ వెగ్గలం రవీంద్రాచారి, వేణు, శ్రీనివాసాచారి, వెంకటేశ్వరరావు, ఎంఆర్ సురేష్, సుధా పరిటాల తదితరులు పాల్గొన్నారు. శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ, రత్నానగర్ బస్తీ సంక్షేమ సంఘం సంయుక్తాధ్వర్యంలో హుస్సేన్‌సాగర్ నాలా నుంచి ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇందులో అభయాంజనేయ స్వామి ఆలయ, బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంబీ. కిషోర్ కుమార్, పి. ఈశ్వర్, పాతకోటి మహేష్, సతీష్ చంద్ర గౌడ్, మురళీ కృష్ణ, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్‌రోడ్డులో చేపట్టిన ర్యాలీలో వీహెచ్...

అంబర్‌పేట: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా నెక్లెస్‌రోడ్డులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో అంబర్‌పేట కాంగ్రెస్ నేతలు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, లక్ష్మణ్‌యాదవ్, తొలుపునూరి కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

పహల్గామ్ ఘటన పిరికిపంద చర్య

కాచిగూడ: జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. శుక్రవారం కాచిగూడ చౌరస్తాలోని వీరసావర్కర్ విగ్రహం వద్ద పాకిస్తాన్ ఉగ్రవాదుల ఫొటోలను బజరంగ్ సేన ఆధ్వర్యంలో తగలబెట్టారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా.. ఉగ్రవాదుల్లారా ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. పహల్గామ్‌లో అమాయక పర్యాటకులను వారి మతాన్ని అడిగిన తరువాత క్రూరంగా చంపారన్నారు. ఇలాంటి దాడులతో భారతీయ స్ఫూర్తిని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఉగ్రవాద భావజాల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు బజరంగ్ సేన నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన ప్రతినిధులు ఠాకూర్ వికాసింగ్, శ్రీనివాస్ గుప్తా, జైరాజ్ యాదవ్, గులాబ్ శ్రీనివాస్, ప్రవీణ్ యాదవ్, నరేష్, సుజీత్ తదితరులు పాల్గొన్నారు.


నెక్లెస్‌రోడ్డులో చేపట్టిన ర్యాలీలో వీహెచ్, కాంగ్రెస్ నాయకులు


కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం వద్ద ఉగ్రవాదుల ఫొటోలను తగులబెడుతున్న బజరంగ్ సేన నాయకులు


రత్నానగర్ బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు


ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజలు

‘ఎన్నికలు నిర్వహించే అర్హత ట్రస్ట్‌కు లేదు’

ఆరెకటిక సంఘ్ ఇసామియాబజార్

కాచిగూడ: కోకాపేటలోని తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ పేరుతో కొందరు కాచిగూడలోని ఆరెకటిక సంఘ్ ఇసామియాబజార్‌కు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారని అలాంటి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆరెకటిక సంఘ్ ఇసామియా బజార్ అధ్యక్షుడు హెచ్.రమేష్ హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలోని ఆరెకటిక భవన్‌లో జరిగిన సంఘ్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోకాపేటలోని ఆరెకటిక ట్రస్ట్ (రిజిస్టర్ నం.152/2019)కు తమ ఇసామియాబజర్ ఆరెకటిక సంఘ్ (రిజిస్టర్ నం .6233/2001)కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆరెకటిక సంఘ్ ఇసామియాబజార్‌కు ఇటీవలే నూతన కమిటీని ఎన్నుకున్నామని అన్నారు. కొందరు కావాలని తమ సంఘాన్ని అభాసుపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక సంఘ్ ఇసామియాబజార్ ప్రతినిధులు సూర్యప్రకాష్, సాయి సచ్చిదానంద్, బి.శంకర్, శ్యాంసుందర్, సతీష్, రఘునాథ్, జ్ఞానేందర్, రాజు, హరినారాయణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ నూతన కమిటీ


తెలంగాణ ప్రజా ఫ్రంట్ హైద్రాబాద్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా ఫ్రంట్ హైద్రాబాద్ జిల్లా నూతన కమిటీని నియమించినట్లు ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ ఆర్. నాగభూషణం, రాష్ట్ర నాయకులు జక్కుల వెంకటయ్య, కడమంచి రాంబాబులు తెలిపారు. నగర అధ్యక్షుడిగా బి.ముత్తయ్య, ఉపాధ్యక్షులుగా విజయ్‌కృష్ణ, యల్లయ్య సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి అంజయ్య, సహాయ కార్యదర్శిగా పి. శ్రీనివాస్, ఉప్పల సోమయ్య, కార్యవర్గ సభ్యులుగా జి. ఆంజనేయులు, ప్రవీణ్, బోనాల రాజు, బండి రమేష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హైడ్రాలో నష్టపోయిన పేద ప్రజలందరికి పునర్నివాసం కల్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో ప్రజల్ని మోసం చేయవద్దని వారు కోరారు.

కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయండి


విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌దీప్

ముషీరాబాద్: బాపూజీనగర్‌లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి తమగొండ రాజ్‌దీప్ అన్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభం తుప్పుపట్టి ఓవైపు ఒరిగి ప్రమాదంగా మారిందని తెలిపారు. జనాలు అధికంగా తిరిగే ప్రాంతంలో ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ దృష్టికి సైతం తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు జీఎస్ చారి, సీనియర్ నాయకులు రమేష్‌గౌడ్ తదితరులున్నారు.

రజతోత్సవానికి భారీ ఏర్పాట్లు

● ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి సభకు భారీగా తరలనున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
● 100 బస్సులు, 200 కార్లలో వెళ్లనున్న కార్యకర్తలు, నాయకులు, అభిమానులు
● 200 ప్రాంతాల్లో గులాబీ జెండాల ఆవిష్కరణ ● ప్రధాన కూడళ్లల్లో భారీ కటౌట్ల ఏర్పాటు



ముషీరాబాద్‌లో వాల్ రైటింగ్ చేస్తున్న ముఠా జైసింహ,



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీకి 25 ఏళ్లు నిండిన సందర్భంగా వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 27న తలపెట్టిన భారీ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహల నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే డివిజన్ల వారీగా కోఆర్డినేషన్ కమిటీలు, ప్రచార కమిటీలను ఏర్పాటు చేసి భారీ జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనే ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలను తరలించి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తండ్రీకొడుకులు శాయశక్తులా కృషి చేస్తున్నారు.

- నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌ల నుంచి ఒక్కో డివిజన్‌కు 700 మంది చొప్పున జన సమీకరణ చేయాలని నిర్ణయించారు.
- ఒక్కో డివిజన్‌కు 15 చొప్పున మొత్తం 100 బస్సులను ఇప్పటికే బుక్ చేశారు. అదనంగా మరో 200 వందల కార్లతో ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించారు.
- 27వ తేదీ ఉదయం 9గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా 200 చోట్ల గులాబీ జెండాలను ఎగురవేయాలన్నారు.
- అక్కడ నుంచి నేరుగా బయల్దేరి సాయంత్రం 4గంటలకు వరంగల్ సభాస్థలికి చేరుకోవాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది.
- అందులో భాగంగా జెండా దిమ్మెలను ఇప్పటికే గులాబీ రంగు పూసి ముస్తాబు చేశారు. గులాబీ తోరణాలతో అలంకరించారు.
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జెండా ఎగరవేసి అక్కడ నుంచి జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తారు.
- మార్గమధ్యలో ఆలేరు దాటిన తరువాత జీడికల్లు రోడ్డు మార్కెట్ ఆఫీస్ సమీపంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో 5వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు.
- వరంగల్ బహిరంగ సభకు హాజరయ్యే ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త గులాబీ చొక్కా ధరించి రావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

వేలాదిగా తరలిరండి



బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేలాదిగా తరలిరావాలి. ఉదయం 9 గంటల వరకు బస్తీల్లో జెండాలు ఎగరవేసి బస్సుల్లో బయలుదేరాలి. సాయంత్రం నాలుగు ంటల వరకు చేరుకోవాలి. ఆలేరులో ఏర్పాటు చేసిన భోజన వసతిని సద్వినియోగం చేసుకోవాలని క్రమ శిక్షణ పాటిస్తూ సభాస్థలికి చేరుకోవాలన్నారు.

– ముఠా జైసింహ

మలేరియా డే ర్యాలీ

ముషీరాబాద్: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముషీరాబాద్, భోలక్‌పూర్, బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, మలేరియా శాఖ సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ రంగానగర్, భోలక్‌పూర్, శివాలయం వీధి, భరత్‌నగర్ తదితర ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించారు. మలేరియా వ్యాధిపట్ల జాగ్రత్తగాఉండాలని, మలేరియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమలో పీహెచ్ఎన్‌లు వనిత, ఫెల్లీస్, కళావతి, ఏఎన్ఎంలు లక్ష్మీబాయి, విజయకుమారి, సునీత, రత్నమాల, అనురాధ, సంతోసిణి, శీలా, లత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, మలేరియా శాఖ సిబ్బంది

‘కాంగ్రెస్ అడుగడుగునా అంబేడ్కర్‌ను అవమానించింది’

● రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్
● హమారా సంవిధాన్.. హమారా స్వాభిమాన్ సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అడుగడుగునా అవమానిస్తే 70 ఏళ్ల తరువాత అంబేడ్కర్ ఆశయాలను, లక్ష్యాలను అమలు చేస్తున్న ఘనత నేటి ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ‘హమారా సంవిధాన్.. హమారా స్వాభిమాన్’ పేరుతో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఆధ్వర్యంలో ముషీరాబాద్ హెరిటేజ్ హాల్‌లో నిర్వహించిన సదస్సుకు డాక్టర్ కె.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉందంటే డాక్టర్ అంబేడ్కర్ దూరదృష్టితో రచించిన రాజ్యాంగ ఫలితమే అని కొనియాడారు. ఏప్రిల్ 14 అంబేడ్కర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన రచించిన రాజ్యాంగాన్ని భారీ అంబారి మీద ఊరేగిస్తూ మోదీ నడుచుకుంటూ రాజ్యాంగానికి సముచిత గౌరవం కలిగించారని కొనియాడారు. – దేశంలో రెండు ప్రధానులు, రెండు చట్టాలను చల్లవని అంబేడ్కర్ చెప్పిన విధంగానే బీజేపీ కూడా మొదటి నుంచి వాదిస్తోందని అన్నారు. 1947లో మతం పేరు మీద దేశం రెండు ముక్కలు అయ్యిందని 370 ఆర్టికల్ పేరుతో కశ్మీర్‌ను కూడా భారత్‌కు దక్కకుండా చేస్తున్నారని అంబేడ్కర్ ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. నెహ్రూ తన కుర్చీ కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటే అంబేడ్కర్ దేశ భవిష్యత్ కోసం ప్రయత్నించారని అన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీకి భారతరత్న తీసుకున్నారు కానీ అంబేడ్కర్‌కు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ సెంటర్ హాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ చిత్రపటం కూడా పెట్టలేదని గుర్తు చేశారు. అలాగే అంబేడ్కర్ ఢిల్లీలో చనిపోతే ఆయన దహన సంస్కారాలు ఢిల్లీలో చేయకుండా ముంబాయి తరలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, కార్పొరేటర్లు పావనివినయ్, రచనశ్రీ, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, వెంకటరమణి, సదానంద్‌ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు గండి కృష్ణ, గజ్జల రాజశేఖర్, వంశీతిలక్, పాశం, మద్దూరి శివాజీ, ఆయుష్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సదస్సుకు హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ రాజమౌళిగుప్తాకు సతీవియోగం


అమృతమ్మ (ఫైల్)

ముషీరాబాద్: ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రసిడెంట్ గంజి రాజమౌళిగుప్తా భార్య అమృతమ్మ(82) శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సందర్భంగా జిల్లాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాంలు ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించి రాజమౌళిగుప్తాను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ డాకర్ కె.లక్ష్మణ్‌లు రాజమౌళిగుప్తాను ఓదార్చారు. ఆమె అంత్యక్రియలు అంబర్‌పేట శ్మశానవాటికలో నిర్వహించారు.

ఐక్య ఉద్యమాలతోనే సామ్రాజ్యవాదాన్ని ఓడించాలి

క్యూబా రాయబారి జాన్ కార్లోస్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామ్రాజ్యవాదాన్ని ఓడించాలంటే ఐక్య కమ్యూనిస్ట్ ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందని క్యూబా రాయబారి, పార్లమెంట్ సభ్యులు జాన్ కార్లోస్ అన్నారు.క్యూబాకి సంఘీభావంగా భారతదేశంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో ఆనందాన్ని, ధైర్యాన్ని ఇస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ సంయుక్త ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ సదస్సు జరిగింది.

- ముఖ్యఅతిథిగా హాజరైన జాన్ కార్లోస్ మాట్లాడుతూ... వివిధ దేశాల నుంచి కూడా క్యూబాకు సంఘీభావం లభిస్తోందని అన్నారు. తాము 65 సంవత్సరాలుగా ఇండిపెండెట్‌గా పనిచేస్తున్నప్పటికీ అనేక దేశాల నుంచి సంఘీభావం లభిస్తోందన్నారు. అమెరికా ఒత్తిడిని తట్టుకొని కమ్యూనిస్ట్ రాజ్యంగా కొనసాగుతున్నామని అన్నారు. క్యూబా అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని విమాన రాకపోకలను కూడా అమెరికా అడ్డుకుంటోందని అన్నారు. అమెరికాలో ఉన్న రెండు కోట్ల మంది క్యూబాకి చెందిన వారిపై అనేక ఆంక్షలను విధించిందన్నారు.
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ... క్యూబా దేశం మీద అమెరికా కొనసాగిస్తున్న దమనకాండను వ్యతిరేకించాలన్నారు. క్యూబాపై అనేక ఆంక్షాలు పెట్టి ఆర్థికంగా దిగ్బంధనం చేసిందన్నారు. సోషలిస్ట్ ప్రభుత్వాన్ని కూల్చి వేయాలని కుట్రలు చేస్తోందని విమర్శించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర నాయకులు స్టాలిన్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు విఎస్ .బోస్, టి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

‘వికసిత్ భారత్’పై జాతీయ సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ వనరుల అభివృద్ధి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. మానవ వనరుల నాణ్యతను పెంచుకుంటే పెరుగుతున్న జనాభా ఈ దేశానికి సమస్య కాదని వారు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ కళాశాలలో ‘వికసిత్ భారత్–2047’ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశం ఆర్థికంగా ఎదగాలంటే యువత, మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వ్యవసాయ రంగంలో మార్పులు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజారాం, ప్రొఫెసర్ పి.నరసయ్య, ప్రొఫెసర్ లక్ష్మణ్‌గౌడ్, ప్రొఫెసర్ శ్రీనివాస్, పి.వి. రమణ కుమార్, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ మట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ పురుషోత్తంను మెమొంటోతో సత్కరించారు.


సదస్సు ముగింపు సమావేశంలో ప్రొ. ఇటిక్యాల పురుషోత్తం

మార్షల్‌ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

ముషీరాబాద్: విద్యార్థులు విద్యతో పాటు మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని హైదరాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో తైక్వాండో సాయిరక్ష అకాడామీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్, బ్లాక్ బెల్ట్‌లో ఉత్తీర్ణులైన క్రీడాకారులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై 50మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బెల్టులు, మెడల్స్ పంపిణీ చేసి మాట్లాడారు. తైక్వాండో క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

నత్తనడకన నాలా పనులు

వర్షాకాలం సమీపిస్తున్న పూర్తి కాని పనులు

సుందరయ్య విజ్ఞాన కేంద్ర: సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి భగత్‌సింగ్‌నగర్ మీదుగా నారాయణగూడ బ్రిడ్జ్ నాలా వరకు కొనసాగుతున్న నాలా విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదు నెలల క్రితం ప్రారంభమైన నాలా పనులు ఇంకా పూర్తి కాలేదు. వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ సగం పనులు కూడా పూర్తికాకపోవడంతో సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. కొద్ది మంది వర్కర్స్‌తోనే పనులు చేయిస్తున్నారని అందువల్లే పనులు త్వరతగతిన పూర్తి కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రెండు కోట్ల రూపాయల నిధులతో ఎస్ఎన్‌డీపీ వారు జనరల్ బడ్జెట్ కింద పనులు ప్రారంభమయ్యాయి.

- అయితే ఇక్కడ 1800ల ఎంఎం డయామీటర్ పైపులైన్‌లు 40, 1600ల ఎంఎం డయామీటర్ పైపులైన్‌లు 30, మొత్తం 70 పైపులైన్‌లు నాలా విస్తరణకు ఉపయోగిస్తున్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నారాయణగూడ బ్రిడ్జ్ మూసీ నాలా వరకు 350 మీటర్ల వరకు పైపులైన్ వేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నత్తనడకన పనులు కొనసాగడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి పోవాల్సిన వాహనాలా చుట్టూ తిరిగి పోవాల్సి వస్తోంది. అక్కడ పార్కింగ్ సమస్య పెద్ద ఎత్తున ఉంది. వర్షాకాలం సమీపిస్తున్నా పనులు పూర్తి కావడం లేదు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నత్తనడకన కొనసాగుతున్న నాలా పనులు

చాలా ఇబ్బందిగా ఉంది



ఇన్ని నెలలైనా నాలా పనులు పూర్తి చేయకపోవడం చాలా ఇబ్బందిగా ఉంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పార్కింగ్ సమస్య కూడా తీవ్ర స్థాయిలో ఉంది. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఎస్. రమేష్‌రెడ్డి, స్థానికుడు

త్వరితగతిన పూర్తి చేయాలి



త్వరిత గతిన పనులు పూర్తి చేస్తే అందరికి సౌకర్యంగా ఉంటుంది. వర్షాకాలం సమీపిస్తున్న మంద కొడిగా పను లు కొనసాగడం సరైనది కాదు. మా కార్యాలయం ముందు నుంచే నాలా పనులు కొనసాగుతున్నాయి. ఆఫీస్‌కు రావడానికి, పోవడానికి ఇబ్బందిగా ఉంది. పనుల నాణ్యతను అధికారులు సమీక్షిస్తున్నట్టుగా లేదు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలి.

– అయిలినేని కిషన్‌రావు, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్